# మీ ఓటు మీ భవిష్యత్తు



ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అనేది సామాన్యుడికి లభించిన అత్యంత శక్తివంతమైన ఆయుధం. దేశ పాలన దిశను నిర్ణయించే శక్తి ఓటులోనే ఉంది. అలాంటి విలువైన ఓటు నేడు డబ్బు, మద్యం, ప్రలోభాల కింద నలుగుతోంది. ఎన్నికలు సమీపించగానే కొందరు రాజకీయ నాయకులు ఓటర్లను కొనుగోలు చేసే ప్రయత్నాలకు తెగబడటం ప్రజాస్వామ్యానికి తీరని మచ్చగా మారుతోంది. రూ. 2 వేలకో, రూ. 5 వేలకో ఓటు అమ్ముకోవడం సాధారణమైపోయిన పరిస్థితి తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఈ ధోరణి కొనసాగితే ప్రజాస్వామ్య వ్యవస్థ పునాదులే దెబ్బతింటాయి. ఓటు విలువ తగ్గిపోతే, ప్రజల గొంతుక మౌనమవుతుంది. ప్రజల ఆశలు, ఆకాంక్షలు ప్రతిబింబించని పాలన ఏర్పడుతుంది. ఓటు అమ్ముకోవడం కేవలం వ్యక్తిగత ప్రయోజనానికి పరిమితం కాదు. అది సమాజానికి చేసిన అన్యాయం. డబ్బు ఇచ్చి ఓట్లు సంపాదించిన నాయకులు ఎన్నికల తర్వాత ప్రజల వైపు చూడరు. అభివృద్ధి మాటలు కాగితాలకే పరిమితం అవుతాయి. గ్రామాల్లో రహదారులు, తాగునీరు, కాలువలు, పట్టణాల్లో మౌలిక సదుపాయాలు నిర్లక్ష్యం పాలవుతాయి. చివరకు బాధలు అనుభవించేది అదే ఓటరు. ఎన్నికల సమయంలో లభించే కొద్ది డబ్బుతో కుటుంబ భవిష్యత్తు మారదు. కానీ ఆ డబ్బు తీసుకుని వేసిన ఓటు వల్ల ఏర్పడే తప్పు నాయకత్వం ఐదేళ్ల పాటు ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తుంది. అవినీతి పెరుగుతుంది. ప్రజాధనం దుర్వినియోగమవుతుంది. సమాజంలో అసమానతలు మరింత పెరుగుతాయి.

ప్రజాస్వామ్యంలో ఓటు అనేది హక్కుతో పాటు బాధ్యత కూడా. ఓటు వేయేటప్పుడు అభ్యర్థి నిజాయితీ, ప్రజల పట్ల ఉన్న నిబద్ధత, సేవా దృక్పథం, గత పనితీరును పరిశీలించాల్సిన అవసరం ఉంది. కేవలం క్షణిక లాభాల కోసం దీర్ఘకాల నష్టాన్ని ఆహ్వానించకూడదు.

ముఖ్యంగా యువత ఈ విషయంలో ముందుండాలి. ఓటు విలువను అర్థం చేసుకుని, ప్రలోభాలకు దూరంగా ఉండాలి. ఓటు అమ్ముకోవడం నేరమని, అది భవిష్యత్తు తరాలపై ప్రభావం చూపుతుందని గుర్తించాలి. ప్రజలు మేల్కొన్నప్పుడే నాయకులు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తారు.

డబ్బు, భయభ్రాంతులు, ఒత్తిళ్లకు లోనుకాకుండా స్వేచ్ఛాయుతంగా ఓటు వేయడమే నిజమైన ప్రజాస్వామ్యానికి పునాది. ప్రజలే ప్రశ్నిస్తేనే పాలకులు జవాబుదారీతనంతో పనిచేస్తారు.

ఆలోచించి వేసిన ఒక్క ఓటే గ్రామాన్ని, జిల్లాను, రాష్ట్రాన్ని మార్చగల శక్తి కలిగి ఉంటుంది. మీ ఓటుకు లేదు సమాధానం చెప్పాలి. ప్రలోభాలను తిరస్కరించాలి. అంతఃకరణానికి అనుగుణంగా ఓటు వేయాలి. అభివృద్ధికి అండగా నిలవాలి. ఎందుకంటేఒక్క ఓటే ప్రజాస్వామ్యాన్ని బలపరుస్తుంది. ఒక్క తప్పు ఓటే భవిష్యత్తును అంధకారంలోకి నెట్టేస్తుంది.



సీనియర్ జర్నలిస్ట్ కొట్టె సుధాకర్
లెనిన్ :9908401581

# బాధిత కుటుంబానికి శ్రీనివాస్ రెడ్డి పరామర్శ

## ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకుల అందజేత



**రాయపర్తి/ఫిబ్రవరి 10 (జర్నలిస్ట్ వార్త):** మండలంలోని మైలారం గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబ సభ్యుడు జక్కుల కొమురయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, మంగళవారం ఆ కుటుంబాన్ని ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ఛైర్మన్, బీఆర్ఎస్ జిల్లా నాయకులు పరుపాటి శ్రీనివాస్ రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుని కుటుంబ సభ్యులను ఆదుకుంటూ, ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 50 కేజీల బియ్యం, ఆయిల్ క్యాన్‌ను అందజేశారు. బాధిత కుటుంబానికి తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని శ్రీనివాస్ రెడ్డి భరోసా ఇచ్చారు. అనారోగ్యం కారణంగా కుటుంబ పెద్దను కోల్పోవడం తీవ్ర విషాదమని పేర్కొన్న ఆయన, ఇలాంటి సందర్భాల్లో సామాజిక బాధ్యతగా ముందుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. పేద కుటుంబాలకు చేయూత అందించడమే ఫౌండేషన్ లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు పరుపాటి రవీందర్ రెడ్డి, సంధి దేవేందర్ రెడ్డి, పెరటి యాదవ రెడ్డి, గుడెల్లి వెంకటయ్య, గబ్బేట యాకయ్య, సంకినేని ఎల్లాస్వామి, బాధ సుధాకర్, బాధ రవి తదితరులు పాల్గొన్నారు.

# ధర్మసాగర్ బాలికల పాఠశాలలో సర్పంచ్ మాచర్ల జ్యోతి ఆకస్మిక తనిఖీ

## ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో సమగ్ర చర్చ -బోధనభోజనవసతులపై క్షేత్రస్థాయి సమీక్ష


















**ధర్మసాగర్/హనుమకొండ, బ్యూరో ఫిబ్రవరి 10 (జర్నలిస్ట్ వార్త):**హనుమకొండ జిల్లా ధర్మసాగర్ గ్రామంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో గ్రామ సర్పంచ్ మాచర్ల జ్యోతిఏలియా మంగళవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. పాఠశాల విద్యా ప్రమాణాలు, నిర్వహణ తీరు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలును క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు ఈ తనిఖీ చేపట్టారు. తనిఖీ సందర్భంగా ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్‌ను పరిశీలించిన సర్పంచ్, తరగతుల నిర్వహణ, బోధన విధానాలపై ఆరా తీశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, స్కూల్ ఉపాధ్యాయులను విడివిడిగా అడిగి, విద్యార్థుల హాజరు స్థితి, బోధనలో ఎదురవుతున్న సమస్యలు, మౌలిక వసతుల లోపాలు, పాఠశాలకు తక్షణం కావాల్సిన అవసరాలపై సమగ్రంగా వివరాలు తెలుసుకున్నారు. పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రత్యక్షంగా పరిశీలించి, భోజనం నాణ్యత, పరిశుభ్రత, మెనూ అమలుపై ఉపాధ్యాయులు, వంట సిబ్బందిని ప్రశ్నించారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనం రుచికరంగా, పోషకాహారంతో ఉండాలని, ఆరోగ్య భద్రతపై ఏమాత్రం రాజీ పడబోమని స్పష్టం చేశారు. మధ్యాహ్న భోజనంలో నిర్లక్ష్యం కనిపిస్తే కఠిన చర్యలు తప్పవని కార్మికులను హెచ్చరించారు.

మధ్యాహ్న భోజనం విషయమై విద్యార్థులతో నేరుగా మాట్లాడిన సర్పంచ్, భోజనం సమయానికి అందుతోందా, నాణ్యతపై ఎలాంటి ఫిర్యాదులున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అలాగే పాఠశాలలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును పరిశీలించి, భద్రతా ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. త్రాగునీటి సౌకర్యాలను పరిశీలించి, నీటి నాణ్యతపై ఆరా తీశారు. విద్యార్థులతో మమేకమైన సర్పంచ్, బోధన విధానం, పాఠ్యాంశాల అవగాహన, ఉపాధ్యాయుల సహకారం, పాఠశాలకు అవసరమైన అదనపు వసతులపై అభిప్రాయాలు సేకరించారు. ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తోందని, ఏవైనా సమస్యలు ఉంటే నేరుగా గ్రామ పంచాయతీ దృష్టికి తీసుకురావాలని విద్యార్థులను కోరారు.

ఈ సందర్భంగా సర్పంచ్ మాచర్ల జ్యోతిఏలియా మాట్లాడుతూ ప్రభుత్వ బాలికల పాఠశాల సమగ్ర అభివృద్ధికి గ్రామ పంచాయతీ తరఫున పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు సురక్షిత వాతావరణం కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని పేర్కొన్నారు. చదువుతోపాటు క్రీడలు, సహపాఠ్య కార్యక్రమాల్లోనూ పాల్గొంటూ సమగ్ర అభివృద్ధి సాధించాలని, చదువు ద్వారానే ఉన్నత భవిష్యత్తు సాధ్యమవుతుందని విద్యార్థులకు పిలుపునిచ్చారు

# మహబూబ్‌నగర్‌లో రైతు పొలంబడి కార్యక్రమం

## సమగ్ర సస్యరక్షణ పద్ధతులపై అవగాహన



**రాయపర్తి/ఫిబ్రవరి 10 (జర్నలిస్ట్ వార్త):** మండలంలోని మహబూబ్‌నగర్ గ్రామంలో మంగళవారం రైతు పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. కేంద్రీయ సమగ్ర సస్యరక్షణ కేంద్రం, హైదరాబాద్ ఆధ్వర్యంలో ప్లాంట్ ప్రొటెక్షన్ ఆఫీసర్ హొన్నప్పగౌడ నేతృత్వంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పాల్గొన్న రైతులకు లింగాకర్షక బుట్టలను పంపిణీ చేశారు. అనంతరం అసిస్టెంట్ ప్లాంట్ ప్రొటెక్షన్ ఆఫీసర్ ఉదయ శంకర్, శహొన్నప్పగౌడ రైతులతో మాట్లాడారు. వ్యవసాయంలో సమగ్ర సస్యరక్షణ (ఐపీఎం) పద్ధతుల ప్రాధాన్యతను వివరించారు. లోతు దుక్కులు, ఎర పంటల సాగు, లింగాకర్షక బుట్టల వినియోగం ద్వారా పంటలకు నష్టం కలిగించే పురుగులు, తెగుళ్లను సమర్థవంతంగా నియంత్రించవచ్చని తెలిపారు. ముఖ్యంగా మొక్కజొన్న పంటను ఆశించే పురుగులు, తెగుళ్ల లక్షణాలు, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. రసాయనాల వినియోగాన్ని తగ్గించి, సమగ్ర సస్యరక్షణ పద్ధతులను పాటించడం ద్వారా ఖర్చులు తగ్గడమే కాకుండా దిగుబడులు పెరుగుతాయని సూచించారు. రైతుల కోసం ప్రత్యేకంగా నిర్వహిస్తున్న ఈ పొలంబడి కార్యక్రమాలను పూర్తిగా సద్వినియోగం చేసుకొని, ఐపీఎం పద్ధతులను క్షేత్రస్థాయిలో అమలు చేయాలని అధికారులు రైతులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పెండ్లి మహేందర్ రెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారి రాజేష్ రెడ్డి, స్థానిక రైతులు తదితరులు పాల్గొన్నారు.

# క్షణికానందం వెనుక జీవితకాలపు వేదన

**రూపాయి అవసరం కోసం పది రూపాయల వడ్డీకి**
**ఈఎంఐ మాయాజాలం**
**తీరని అప్పులు..**
**మారని బతుకులు..**



సీనియర్ జర్నలిస్ట్ బిర్రు కరుణాకర్
9701249103

ఒకప్పుడు అప్పు చేయాలంటే భయం.. కానీ ఇప్పుడు అదే అప్పు అరచేతిలోకి వచ్చేసింది. ఒక స్మార్ట్‌ఫోన్ క్లిక్, ఒక సంతకం. క్షణాల్లో బ్యాంకు ఖాతాలోకి నగదు చేరుతోంది. కానీ, ఆ క్షణికానందం వెనుక జీవితకాలపు వేదన దాగి ఉందన్న సత్యాన్ని మధ్యతరగతి ఉద్యోగులు ఆలస్యంగా గుర్తించి అల్లాడిపోతున్నారు. ఇది కేవలం ఒక వ్యక్తి సమస్య కాదు, లక్షలాది కుటుంబాల ప్రస్తుత దయనీయ స్థితి.

### ఆదాయం ఒకరిది.అనుభవం బ్యాంకుది

నెలవారీ జీతం రాకముందే ఏ ఖాతాకు ఎంత వెళ్లాలో ముందే నిర్ణయమైపోతోంది. ఒకటో తేదీన మొబైల్‌కు వచ్చే శాలరీ క్రెడిటెడ్ మెసేజ్ ఇచ్చే సంతోషం ఐదు నిమిషాలు కూడా ఉండటం లేదు. వెనువెంటనే వచ్చే ఈఎంఐ డెబిట్ మెసేజ్‌లు ఉద్యోగి గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్నాయి. ఇంటి అద్దె, పిల్లల ఫీజులు పక్కన పెడితే. వ్యక్తిగత రుణాలు, క్రెడిట్ కార్డ్ బకాయిలు, గృహ రుణాల ఈఎంఐలే మొదటి స్థానాన్ని ఆక్రమిస్తున్నాయి. రూపాయి అవసరం కోసం పది రూపాయల వడ్డీకి తెచ్చిన అప్పులు, వాటిని తీర్చేందుకు చేసే మరిన్ని అప్పులు ఒక విషవలయంగా మారుతున్నాయి.

### కుటుంబాల్లో చిచ్చు. మానసిక కుంగుబాటు

అప్పుల బాధ కేవలం ఆర్థిక సమస్యగానే మిగిలిపోవడం లేదు. అది మనిషి మానసిక స్థితిని చిన్నాభిన్నం చేస్తోంది. పొద్దున లేచింది మొదలు రాత్రి పడుకునే వరకు రేపు ఈఎంఐ ఎలా కట్టాలి?' అనే ఆలోచనే సగటు జీవిని వేధిస్తోంది. ఈ ఒత్తిడి పని ప్రదేశంలో ఏకాగ్రతను దెబ్బతీస్తోంది. ఫలితంగా ఉద్యోగ భద్రతపై కూడా నీలినీడలు కమ్ముకుంటున్నాయి. మరోవైపు, ఆర్థిక ఇబ్బందుల వల్ల భార్యాభర్తల మధ్య నిత్యం ఘర్షణలు జరుగుతున్నాయి. కనీస అవసరాలు కూడా తీర్చలేని స్థితిలో ఉన్నామని పిల్లల ముందు తలదించుకోవాల్సిన పరిస్థితి తండ్రులకు ఎదురవుతోంది.

### అవసరం వాడుకుంటున్న అధిక వడ్డీలు

బ్యాంకుల నుంచి తక్కువ వడ్డీకి రుణాలు దొరకని వారు, యాప్‌ల ద్వారా వచ్చే సులభ రుణాలకు బానిసలవుతున్నారు. వీటిలో వడ్డీ రేట్లు సామాన్యుల నడ్డి విరుస్తున్నాయి. చక్రవడ్డీల మాయాజాలంలో అసలు కంటే వడ్డీయే రెట్టింపవుతున్నా. తప్పనిసరి పరిస్థితుల్లో ఆ ఊబిలోకి దిగుతున్నారు. ఒక్కసారి ఈ ఊబిలో చిక్కుకుంటే, జీవితాంతం రెక్కల కష్టం వడ్డీలకే సరిపోతోంది తప్ప, అసలు మాత్రం కరగడం లేదు. ఈఎంఐల సంకెళ్ల వల్ల పొదుపు అనే మాటే మధ్యతరగతి డిక్షనరీ నుంచి మాయమైపోయింది. ఏదైనా అనారోగ్యం వస్తే మళ్లీ అప్పు చేయడమే మార్గం అవుతోంది. పిల్లల ఉన్నత చదువుల కోసం దాచుకున్నది ఏమీ లేకపోవడంతో, వారి భవిష్యత్తు కూడా అప్పుల పాలవుతోంది. గొర్రె తోక బెత్తెడు అన్న చందంగా, జీతం పెరిగినా పెరిగిన ధరలు, పెరిగిన వడ్డీ రేట్లు సామాన్యుడిని కోలుకోనివ్వడం లేదు.

ఈ ఈఎంఐ మత్తు నుంచి బయటపడాలంటే జీవనశైలిలో మార్పు తప్పనిసరి. అవసరానికి, ఆశకు మధ్య వ్యత్యాసాన్ని గుర్తించకపోతే జీవితం అప్పుల కుప్పగా మారుతుందని ఈ అమ్మాయిలో తో కృంగిపోయిన ఉద్యోగస్తులు

చెబుతున్నారు. ఆదాయంలో కనీసం 30 శాతం కూడా మిగుల్చుకోలేని పరిస్థితి ఉందంటే, అది ప్రమాదకర సంకేతమని వారు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా మేల్కోకపోతే, మానవ మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందంటున్నారు.

